క్లుప్తంగా

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం



ఎముకల పటుత్వ పరీక్షలు చేస్తున్న సిబ్బంది

నర్సీపట్నం: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శ్రీవేంకటేశ్వర హాస్పిటల్‌లో ఎముకల పటుత్వ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రముఖ వైద్యులు డాక్టర్ అధికారి గోపాలరావు ప్రారంభించారు. ఎముకల పటుత్వానికి నువ్వులు, పాలకూర, పాలు, గుడ్లు కాల్షియం ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కర్రి రామ్‌గోపాల్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అక్షరాస్యత పెంపునకు కృషి



శిక్షణలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి రామ్మోహన్‌రావు, అధికారులు

మాకవరపాలెం: నిరక్షరాస్యులను అక్షరాస్యులను చేసేందుకే అక్షర ఆంధ్ర కార్యక్రమం అమలు చేస్తున్నట్టు మండల ప్రత్యేక అధికారి రామ్మోహన్‌రావు అన్నారు. వెలుగు కార్యాలయంలో శనివారం ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లు, వెలుగు వీవోఏలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్షర్యాత శాతాన్ని పెంచేందుకు అంతా కృషి చేయాలన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై ఇంటింటా ప్రచారం



తగ్గిన జీఎస్టీపై కర్ర పత్రాలు పంపిణీ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

నాతవరం : కేంద్రం ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీపై శనివారం అధికారులు, ప్రజాప్రతినిధులు ఇంటింటా ప్రచారం చేశారు. నాతవరం గ్రామంలో ఇంటింటికి వెళ్లి ఏయే వస్తువులను ఎంత మేర రేట్లు తగ్గించారన్న విషయాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. గ్రామ పంచాయతీల్లో, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రతి ఇంటికి వివరించారు.

గొలుగొండలో బోనాల పండగ



గొలుగొండలో బోనాలతో వెళుతున్న మహిళలు

గొలుగొండ: నవరాత్రుల సందర్భంగా గొలుగొండలో పెద్ద ఎత్తున బోనాల పండగ శనివారం సాయంత్రం నిర్వహించారు. కనకదుర్గ ఆలయం నుంచి వినాయక, మరిడితల్లి, నూకాలమ్మతల్లితో పాటు గ్రామంలో ఉన్న అన్ని దేవాలయాల వద్దకు మహిళలు పెద్ద ఎత్తున వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. నవరాత్రులు సందర్భంగా గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమానికి మహిళలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

రేపు మెగా మెడికల్ క్యాంపు

మాడుగుల : ఈ నెల 29వ తేదీన మాడుగులలో మెగా మెడికల్ క్యాంపు జరగనుందని, మెడికల్ ఆఫీసర్ రాజుకుమార్ తెలిపారు. స్వస్థ్‌నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం స్థానిక సీహెచ్‌సీ ఆస్పత్రిలో ఉదయం 10 గంటలకు జరగనుందన్నారు. కార్యక్రమంలో మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు

కె.కోటపాడు : మూడు నెలలు దాటిన ప్రతి పశువుకూ గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను రైతులు తప్పకుండా వేయించాలని చౌడువాడ పశువైద్యాధికారి సిహెచ్.వై.నాయుడు తెలిపారు. గొండుపాలెం, చౌడువాడ గ్రామాల్లో శనివారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండు గ్రామాల్లో 378 పశువులకు టీకాలు వేశారు.

ఖరీఫ్ వరి పంటకు చీడపీడలు

మాడుగుల రూరల్ : ఖరీఫ్ వరి పంటకు చీడపీడలు సోకాయి. వరి నాట్లు వేసి నెల రోజులు పూర్తి అయ్యాయి. పంటకు దోమపోటు, పాచి తెగులు సోకాయి. దీంతో రైతులు సస్యరక్షణ చర్యలు చేపడుతున్నారు. వరి పనల మీద ఎర్రగా ఉండడంతో వీటి నివారణకు ఎచెపెట్, హెక్సకోనజోల్, మందులు మిశ్రమాన్ని నీటిలో కలిపి పిచికారీ చేయాలని మండల వ్యవసాయాధికారి ఎం. అనసూయ తెలిపారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా

దేవరాపల్లి : బహిరంగ ప్రదేశాలలో చెత్తా చెదారం వేస్తే జరిమానా విధిస్తామని మండల ప్రత్యేక అధికారి, డీడీవో ఎస్.మంజులవాణి హెచ్చరిక జారీ చేశారు. మండలంలోని కాశీపురంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. వీధుల్లో చెత్తా చెదారాలను పొక్లెయిన్ సహాయంతో ట్రాక్టర్‌కు లోడ్ చేసి తొలగించారు.

ప్రమాదపుటంచున ప్రయాణం

భారీ వర్షాలకు దారంతా నీటి గుంతలు

- ప్రయాణికులకు నిత్యం నరకం
- 20 గ్రామాల ప్రజలకు ఆధారం
- రెండు జిల్లాలకు అనుసంధాన మార్గం
- నాతవరం-తాండవ రోడ్డు దుస్థితి



ప్రమాదం అంచున సాగిస్తున్న ప్రయాణం



నాతవరం తాండవ రోడ్డు దుస్థితి

నాతవరం : తాండవ రిజర్వాయరుకు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు పూర్తిగా శిథిలం కావడంతో వాహనదారులు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారు. మండలకేంద్రం నాతవరం గ్రామం నుంచి తాండవ రిజర్వాయరు మధ్య సుమారుగా 8 కిలోమీటర్లు దూరం రోడ్డు ఉంది. పూర్తిగా దెబ్బ తిన్న ఈ రహదారిని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని ఎన్నికల ముందు అయ్యన్నపాత్రుడు హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు గడుస్తున్నా నేటికీ ఈ రోడ్డు సమస్యపై స్పందించలేదు. గతంలో ఈరోడ్డు ఇరిగేషన్‌శాఖ పరిధిలో ఉండడంతో వైఎస్సార్‌సీపీ హయాంలోనే ఆర్అండ్‌బీ శాఖలోకి మార్చేందుకు ప్రతిపాదనలు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ రోడ్డును ఇరిగేషన్ శాఖ నుంచి ఆర్అండ్‌బీశాఖకు విలీనం చేశారు. అయితే రోడ్డు దుస్థితి మాత్రమ మారలేదు. ప్రస్తుతం భారీ వర్షాలకు ఈ రహదారిపై భారీ గోతులు పడి ప్రయాణికులకు మరింత ప్రమాదకరంగా మారింది. వర్షం నీరంతా రోడ్డుపై గోతుల్లో నిల్వ ఉండిపోవడంతో ముఖ్యంగా రాత్రి వేళల్లో రాకపోకలు సాగించేవారు ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డంతా బురదమయం కావడంతో ఏమాత్రం ఏమరుపాటుగా వెళ్లినా ప్రమాదం తప్పదని భయపడుతున్నారు.



రోడ్డు మధ్య గోతుల్లో ఉన్న నీరు



వర్షం పడితే నీరంతా రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

రెండు జిల్లాలకు అనుసంధానంగా..

తాండవ-నాతవరం రోడ్డు అనకాపల్లి, అల్లూరి జిల్లాలను కలుపుతూ నాతవరం, గొలుగొండ, మండలాల ప్రజలకు ఆధారంగా ఉంది. ఈ రహదారిలో అల్లూరి జిల్లా కొయ్యూరు మండలంలో గల అడాకుల మల్లవరం, రొంగలి కొత్తూరు కృష్టారం, కంతారం, బాలారం తదితర గ్రామాల వారు రాపోకలు సాగిస్తుంటారు. విద్యార్థులు పాఠశాలలు, కాలేజీలకు నర్సీపట్నం, తుని పట్టణాలకు వెళ్లడానికి కూడా ఇదే ప్రధాన మార్గం. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు పూర్తిగా శిథిలం కావడంతో నీరంతా రోడ్డుపైనే ప్రవహిస్తుంది,. ఆర్‌టీసీ బస్సు ఇతర ప్రైవేటు వాహనాలు రోడ్డు దుస్థితిని చూసి నడపలేమంటూ హెచ్చరికలు చేస్తున్నారు.

తాండవ రిజర్వాయరుకు వెళ్లే ప్రధాన రోడ్డు

తాండవ ప్రాజక్టుకు వెళ్లడానికి ఈ రోడ్డే ప్రధాన మార్గం. ప్రాజెక్టులో నీటి మట్టం ప్రమాద స్థాయిలో ఉన్నప్పుడు అత్యవసర సమయంలో ఈరోడ్డుపై వెళ్లడానికి అధికారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగా వచ్చే అధికారులు ఈరోడ్డులో ఒక్కసారి వస్తే మరలా రావడానికి భయపడి పోతున్నారు. ఈ రోడ్డు బాగున్నప్పుడు ప్రతి ఆదివారం సెలవు దినాల్లో తాండవ ప్రాజక్టు చూసేందుకు అధిక సంఖ్యలో పర్యాటకులు వచ్చేవారు. రోడ్డు పూర్తిగా శిథిలం కావడంతో సందర్శకుల రాక తగ్గింది.

అయ్యన్న హామీ నెరవేర్చాలి



ఎన్నికల ముందు స్పీకర్ అయ్యన్న పాత్రుడు ఇచ్చిన హామీని యుద్ధప్రతిపాదికన నెరవేర్చాలి. నాతవరం-తాండవ రోడ్డు పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలి.

– లగుడు నాగేశ్వరరావు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు

మరమ్మతులకు ప్రతిపాదనలు



నాతవరం-తాండవ రోడ్డు మరమ్మతులకు రూ.76 లక్షలతో ప్రతిపాదనలు చేశాం. ఇంకా ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాలేదు. ఇటీవల ఇరిగేషన్ శాఖ నుంచి ఆర్అండ్‌బీశాఖకు విలీనం కావడంతో స్వాధీనం చేసుకున్నాం. నిధులు వస్తే మరమ్మతులు చేస్తాం. కొత్తగా తారురోడ్డు వేసేందుకు ఎలాంటి ప్రతిపాదనలు లేవు.

– నీరుకొండ లోవతల్లి నాయుడు, జేఈ, ఆర్అండ్‌బీ

ప్లాస్టిక్ వినియోగం మానండి



రోలుగుంటలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం



సూర్రెడ్డిపాలెంలో పారిశుధ్య కార్యక్రమంలో పాల్గొన్న డ్వామా పీడీ పూర్ణిమాదేవి

కె.కోటపాడు : సూర్రెడ్డిపాలెంలో శనివారం స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. డ్వామా పీడీ మండల ప్రత్యేకాధికారి ఆర్.పూర్ణిమాదేవి చీపురు చేతబట్టి పారిశుధ్య కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో షాపుల నిర్వాహకుల వద్దకు వెళ్లి ప్లాస్టిక్ వాడకాన్ని మానాలని సూచించారు. ఖాళీ ప్రాంతాల్లో మొక్కలు నాటాలన్నారు.

నాతవరం : ప్రభుత్వ కార్యాలయాలు ప్రాంగణమంతా ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకునే బాధ్యతలు ఆయా శాఖల అధికారులు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి మంగవేణి అన్నారు. మండల పరిషత్, తహసీల్దార్, వెలుగు ఉపాధి హామీ పథకం కార్యాలయాల వద్ద శనివారం తుప్పలు, చెత్త స్వయంగా తొలగించారు. ఎంపీడీవో శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ టి.వి.ఎల్.రాజు పాల్గొన్నారు.



ప్రభుత్వ కార్యాలయాల వద్ద చెత్త తొలగిస్తున్న మండల ప్రత్యేకాధికారి మంగవేణి

రోలుగుంట : గ్రామ పంచాయతీలో శనివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. డీఎల్‌డీవో, మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. షాపుల నిర్వాహకులు చెత్తను వేసేందుకు ప్లాస్టిక్ డబ్బాలను ఏర్పాటు చేయాలని సూచించారు.

ప్రకృతి వ్యవసాయంతో ఎంతో లాభం



వార్షిక నివేదికను ఆవిష్కరించిన సంఘ సభ్యులు

కె.కోటపాడు : రైతులు ప్రకృతి వ్యవసాయ సాగు విధానంలో పండించిన పంటకు మంచి మద్దతు ధర లభించనున్నట్టు కృషిఫల రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు, గుల్లేపల్లి సర్పంచ్ బండారు దేముళ్లు అన్నారు. గొండుపాలెంలో గల కృషిఫల రైతు ఉత్పత్తిదారుల సంఘం 6వ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. దేముళ్లు మాట్లాడుతూ ఈ సంఘంలో మండలంలో 20 గ్రామాలకు చెందిన 600 మంది రైతులు సభ్యులుగా ఉన్నారన్నారు. వీరు పండించే వరి, కూరగాయల పంటలకు సంఘం ద్వారా మేలైన మద్దతు ధర లభించేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కృషిఫల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కందర్ప రామకృష్ణ విగ్రహాన్ని ఆవిష్కరించారు.

దేవదాయ భూముల ఆక్రమణలను తొలగించండి



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

దేవరాపల్లి : దేవరాపల్లిలో దేవదాయ భూముల్లో ఆక్రమణలను తొలగించాలని తహసీల్దార్ పి.లక్ష్మీదేవికి స్థానికులు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో గ్రామానికి చెందిన చొక్కాకుల రమణ శనివారం లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. దేవరాపల్లి ప్రజల ఆరాధ్య దైవం ఉమామహేశ్వరీదేవి ఆలయానికి సంబంధించి దేవదాయ ధర్మదాయ శాఖకు చెందిన స్థలాన్ని కొందరు దర్జాగా ఆక్రమించి, ఇష్టానుసారం నిర్మాణాలు చేపడుతున్నారని తహసీల్దార్‌కు వివరించారు. కోట్లాది రూపాయలు విలువ చేసే స్థలం అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. హైకోర్టు స్టే ఉన్నప్పటికీ పట్టించుకోకుండా యథేచ్ఛగా అక్రమ కట్టడాలు చేపడుతున్నారన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కె.వి.రమణ, మండల ప్రతినిధులు కొరుపోలు శ్రీను, గంగవంశం సంతోష్ పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సులతో యువతకు ఉపాధి



విద్యార్థులతో మాట్లాడుతున్న జీసీడీవో జమీమా

నర్సీపట్నం : వృత్తి విద్యా కోర్సులతో యువతకు ఉపాధి లభిస్తుందని జిల్లా జీసీడీవో జెమీమా అన్నారు. గొలుగొండ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల విద్యార్థులకు వృత్తి విద్యా శిక్షణలో భాగంగా జరుగుతున్న ఇంటెర్న్‌షిప్ ప్రోగ్రాంను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వశిక్ష అభియాన్ ద్వారా ఒకేషనల్ ఎడ్యుకేషన్ ట్రైనర్ ప్రత్యక్షంగా బోధించిన అనుభవాలతో ఉత్తమ అభ్యాసన అందిపుచ్చుకునే అవకాశం దొరుకుతుందన్నారు. దసరా సెలవుల్లో పదో తరగతి, ఇంటర్, ఐటీ, ఐటీఈఎస్ విద్యార్థులు నర్సీపట్నం, నాతవరం పరిసర ప్రాంతాల్లో కంప్యూటర్ హార్డ్‌వేర్ షాపులు ప్రత్యక్షంగా చూసి నేర్చుకుంటున్నారని వృత్తి విద్యాశిక్షకులు ఎస్.హరిబాబు ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. ఒకేషనల్ కోఆర్డినేటర్ రమేష్, సుధాకర్ పాల్గొన్నారు.

మాజీ మంత్రి బలిరెడ్డికి ఘన నివాళి



పీఎస్‌పేటలో బలిరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చోడవరం : మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు దివంగత బలిరెడ్డి సత్యారావు ఏడో వర్థంతిని ఆయన అభిమానులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు శనివారం నిర్వహించారు. ఆయన స్వగ్రామం పీఎస్‌పేటలో బలిరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బలిరెడ్డి చేసిన సేవలను ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షులు శానాపతి సత్యారావు, దన్నిన వెంకట్రావు, వైస్ ఎంపీపీ బైన ఈశ్వరరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంపలి ఆనందీశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఒరుగంటి నెహ్రూ, జిల్లా ప్రతినిధి హారిక రామకృష్ణ, ఉప్పలబాబు, చవితిన బాబూరావు, కోటేశ్వరరావు, కోవెల జనార్దన్, దన్నిన వెంకట్రావు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు నివాళులు

దేవరాపల్లి : దేవరాపల్లిలోని సీఐటీయూ కార్యాలయంలో స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వి.వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య ఉద్యమంలో అతిచిన్న వయసులోనే ప్రాణాలర్పించిన అసమాన దేశ భక్తుడు భగత్ సింగ్ అని కొనియాడారు.

లలితా త్రిపుర సుందరిగా దుర్గమ్మ




అర్జునగిరిలో భవానీ భక్తులు ఏర్పాటు చేసిన దుర్గమ్మ



వెంకన్నపాలెం కొండపై లలితా త్రిపురసుందరీదేవి అలంకరణలో దుర్గాదేవి



వడ్డాదిలో లలితా త్రిపుర సుందరీ దేవి అలంకరణలో దుర్గాదేవి



శ్రీలలితా త్రిపురసుందరీ అవతారంలో దుర్గాదేవి

నర్సీపట్నం: పట్టణంలో వెలసిన శ్రీదుర్గామల్లేశ్వర స్వామి ఆలయంలో దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా 6వ రోజు శనివారం అమ్మవారు శ్రీలలితా త్రిపురసుందరీ రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి కుంకుమార్చన పూజలు, అభిషేకాలు చేశారు.

మాడుగుల రూరల్: శరనవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు శనివారం వంటర్లపాలెం కనకదుర్గమ్మ ఆలయంలో గల అమ్మవారిని లలితా మహా త్రిపుర సుందరిదేవిగా అలంకరించారు. కె.జె.పురం కళావేదిక మీద ప్రతిష్ఠించిన అమ్మవారికి శుక్రవారం రాత్రి భారీ అంబలం పూజ నిర్వహించారు. స్థానికులు కర్రి నారాయణరావు, ఆడారి పెంటయ్యనాయుడు, కొణతాల మురళీకృష్ణ, ఆర్థిక సహకారంతో 500 మంది భవానీ భక్తులకు చద్ది ఏర్పాటు చేశారు.

చోడవరం: వెంకన్నపాలెం కొండపై వేంచేసియున్న కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ లలిత త్రిపురసుందరీదేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. పెద్దసంఖ్యలో భవానీలు, భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కోలాటాలు శరణుగోషతో భజనలు చేశారు. చోడవరం దుర్గాదేవి ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుపుతున్నారు. లలిత త్రిపురసుందరీదేవి అలంకరణలో అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

మాడుగుల: శరన్న నవరాత్రి ఉత్సవాలులో భాగంగా శనివారం లలితాదేవి అవతారంలో దేవీతల్లి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ వారిచే ఏర్పాటు చేసిన భక్తి గీతాంజలి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



మాడుగులలో లలితాదేవి అవతారంలో దేవీతల్లి

చీడికాడ : అప్పలరాజుపురంలో వెలసిన లలితాదేవి ఆలయంలో ఆరో రోజైన శనివారం అమ్మవారు శ్రీలలితా త్రిపురమాతగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్జునగిరి శ్రీ వరాహలక్ష్మి నృసింహస్వామి ఆలయం ప్రాంగణంలో భవానీ భక్తులు నెలకొల్పిన దుర్గామాత వద్ద ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు.

బుచ్చెయ్యపేట : శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆరోరోజు సీతయ్యపేట దుర్గామల్లేశ్వర అమ్మవారు, వడ్డాది, బుచ్చెయ్యపేట ఆలయాల్లో దుర్గాదేవిని శనివారం లలితా త్రిపుర సుందరీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి దద్దోజనంతో పాటు పలు రకాల పిండివంటలు, పండ్లతో నైవేద్యాలు సమర్పించారు.



దేవీతల్లీ ఆలయప్రాంగణంలో భక్తి గీతాలాపన



లలితాదేవి అవతారంలో వంటర్లపాలెం కనకదుర్గమ్మ

మాడుగుల: శరన్న నవరాత్రి ఉత్సవాలులో భాగంగా శనివారం లలితాదేవి అవతారంలో దేవీతల్లి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ వారిచే ఏర్పాటు చేసిన భక్తి గీతాంజలి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

కొనసాగుతున్న పీహెచ్‌సీ వైద్యుల నిరసన

రోలుగుంట : తమ సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్రనాయకత్వం (ఏపిపిహెచ్‌సీడీఏ) పిలుపు మేరకు తాము ఈ నెల 26న చేపట్టిన ఆందోళన వచ్చే నెల 3వ తేదీ వరకూ పలు రూపాల్లో పీహెచ్‌సీ స్థాయి, జిల్లాస్థాయి, రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తామని ప్రభుత్వ వైద్యులు ఓ ప్రకటనలో తెలిపారు. 26న ఆన్‌లైన్ రిపోర్టింగ్ సేవలు బంద్ చేస్తామని, 27 శనివారం స్వచ్ఛ నారీ కార్యక్రమం, 28న అధికారిక వాట్సప్ గ్రూపు బహిష్కరణ, 29 న ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో ఓపీ సేవలు బంద్ ద్వారా నిరసన తెలుపుతామన్నారు. 30న జిల్లా కేంద్రాల్లో నిరసన, అక్టోబర్ 1న నిరసన ప్రదర్శనలు, 3న విజయవాడలో నిరసన, నిరవధిక నిరాహార దీక్షలు చేపడతామని తమ కార్యాచరణ వివరించారు. జీవో 99 ద్వారా కోత విధించిన ఇన్ సర్వీస్ పీజీ కోటా పునరుద్ధరణ, సకాలంలో పదోన్నతులు, ట్రైబల్ అలవెన్స్, 104/సంచార చికిత్స అలవెన్సు, నోషనల్ ఇంక్రిమెంట్ వంటి డిమాండ్లు నెరవేర్చాలని కోరుతున్నామన్నారు.

నేటి నుంచి ఉపాధి పనుల సామాజిక తనిఖీ

కె. కోటపాడు : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి మండలంలో 18 వ విడత సామాజిక తనిఖీ నిర్వహించడానికి సామాజిక తనిఖీ బృందం సభ్యులతో శనివారం సాయంత్రం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఉపాధి హామీ పథకం ఏపీడీ బి. శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు మండలంలో ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పంచాయతీరాజ్‌శాఖ, ఫారెస్టు, ఎస్.ఎస్.ఎ శాఖల ద్వారా చేపట్టిన పనులపై ఆడిట్ నిర్వహించనున్నట్టు తెలిపారు. రూ.14.62 కోట్లతో చేపట్టిన పనులకు సంబంధించి ఆడిట్ చేయడానికి స్టేట్ రిసోర్స్ పర్సన్ అప్పారావు, మరో 8 మంది డీఆర్‌పీలు ఆదివారం నుంచి గ్రామాల్లో ఆడిట్ చేయనున్నట్టు తెలిపారు. ఏపీవో అప్పలరాజు, ఫారెస్టు డీఆర్‌ఓ ఎ.నూకరాజు, హౌసింగ్ ఏఈ రాము పాల్గొన్నారు.

తురకలపూడిలో మోటార్లకు విద్యుత్ సరఫరా

సాక్షి ఎఫెక్ట్..



తురకలపూడికి నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫారం

బుచ్చెయ్యపేట : మండలంలో గల తురకలపూడి గ్రామంలో విద్యుత్‌శాఖ అధికారులు మోటార్లకు విద్యుత్ కనెక్షన్ అందించారు. తురకలపూడిలో తాగునీటికి అవస్థలు శీర్షికన శనివారం సాక్షి అందించిన కథనానికి విద్యుత్‌శాఖ అధికారులు స్పందించారు. రెల్లి కాలనీలో కాలిపోయిన ట్రాన్స్‌ఫారం తొలగించారు. కొత్త ట్రాన్స్‌ఫారంను సాయంత్రం గ్రామంలోకి తీసుకొచ్చారు. విద్యుత్‌శాఖ ఏఈ రాజు తమ సిబ్బందితో మూడు మోటార్లకు విద్యుత్ కనెక్షన్ అందించారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



నేతవానిపాలెంలో ర్యాలీలో పాల్గొన్న పీఓ మంగతాయారు

బుచ్చెయ్యపేట : పోషకాలున్న సమీకృత ఆహారం తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటామని రావిమతం ఐసీడీఎస్ పీవో మంగతాయారు తెలిపారు. ఈ నెల 27వ తేదీ నుండి అక్టోబర్ 16వ తేదీ వరకు పోషణ మాసోత్సవాలు నిర్వహిస్తున్నామని పీఓ తెలిపారు. శనివారం మండల కేంద్రం బుచ్చెయ్యపేట శివారు నేతవానిపాలెం గ్రామంలో ఆమె ఐసీడీఎస్ సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. గర్భిణులు,బాలింతలు సహజ సిద్ధంగా పండించిన పోషకాలున్న ఆహారం తీసికోవడమే కాకుండా అంగన్‌వాడీ కేంద్రాలో అందిస్తున్న పోషక ఆహారాన్ని సద్వినియోగం చేసికోవాలన్నారు.

కె.కోటపాడు: మహిళలు ఆరోగ్యానికి మొదటి ప్రాధాన్యతను ఇవ్వాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈవో శంకరరావు అన్నారు. వారాడలో శనివారం స్వస్థ నారి స్వశక్త్ పరివార్ అభియాస్ కార్యక్రమం నిర్వహించారు. వారాడ, యద్లవానిపాలెం, చిరికివానిపాలెం గ్రామాలకు చెందిన 187 మంది మహిళలకు ఆరోగ్య పరీక్షలను జరిపి ఉచితంగా మందులను ఇచ్చారు.

నర్సీపట్నం : మున్సిపాలిటీ 6వ వార్డులో అర్బన్ హెల్త్ సెంటర్ వారు ఉచిత మెడికల్ క్యాంపు శనివారం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని టీడీపీ కౌన్సిలర్ పద్మావతి ప్రారంభించారు. డాక్టర్ చాందని, వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

గొలుగొండ : మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, దేశం ఆరోగ్యంగా ఉంటుందని అంగన్‌వాడీ సూపవర్ వైజర్ రాఘవ, సర్పంచ్ ఆదిలక్ష్మి తెలిపారు. పాతమల్లంపేట పంచాయతీలో శనివారం స్వస్థ్ నారీ శక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు.

వీవోఏల సమస్యలపై దశలవారీ పోరాటం

దేవరాపల్లి : వీవోఏల సమస్యల పరిష్కారానికి వచ్చే నెల ఒకటి నుంచి దశల వారీ పోరాటం చేపడుతున్నామని, వీవోఏలు సిద్ధం కావాలని ఏపీ వెలుగు వీవోఏల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వి.వి. శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సీఐటీయూ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల సర్వ సభ్య సమావేశంలో పాల్గొన్నారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ వెలుగు వీవోఏలు కొన్నేళ్లుగా ఆన్‌లైన్ వర్క్ కోసం 5జి మొబైల్స్ ఇవ్వాలని పలుమార్లు ఆందోళన చేపట్టినా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. వచ్చే నెల ఒకటి నుంచి ఆన్‌లైన్ వర్క్ నిలుపుదల చేసి నిరసన వ్యక్తం చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు.